సాక్షి నిజామాబాద్

శుక్రవారం | 2 | ఆగస్టు | 2024



‘ఎస్సీ వర్గీకరణ’పై హర్షం

ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పునివ్వడంతో జిల్లాలో ఎమ్మార్పీఎస్ నాయకులు సంబురాలు చేసుకున్నారు.

- IIIలో ▸



అనుమతులు లేకున్నా..

మంచిప్ప శివారులో టన్నెల్ నుంచి తీసిన కంకరను క్రషర్ యజమాని అనుమతులు లేకుండా తరలిస్తున్నారు.

- IIలో ▸

గరిష్టం/కనిష్టం
31.5 /24.1

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

తెలంగాణలో ఐఐహెచ్‌టీని స్థాపించాలి



సుభాష్‌నగర్ : ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టీ)ని తెలంగాణలో స్థాపించాలని ఎంపీ అర్వింద్ ధర్మపురితో కలిసి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి కేంద్ర జౌళి, టెక్స్‌టైల్స్ శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌ను కోరారు. ఈ మేరకు ఢిల్లీలోని మంత్రి కార్యాలయంలో చేనేత పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తెలంగాణ ఇక్కత్ డిజైన్లకు ప్రసిద్ధి అని, మార్కెట్‌లో అసలు ఇక్కత్ చీరలు రూ.8 వేలు ధర ఉంటుందని భోగ శ్రావణి తెలిపారు. కానీ ప్రింటెడ్ ఇక్కత్ చీరలు కేవలం రూ.300కే లభించడంతో చేనేత కార్మికుల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రింటెడ్ చీరల ఉత్పత్తి, విక్రయాల మీద చర్యలు తీసుకోవాలని కోరారు. చేనేత ఉత్పత్తులపై జీఎస్టీ తొలగించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆమె పోచంపల్లి శాలువాతో మంత్రిని సన్మానించగా, ఆయన శాలువాను ఆసక్తిగా గమనించారు. తెలంగాణ వచ్చినప్పుడు పోచంపల్లిని సందర్శిస్తానని, సమస్యలపై చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు.

ఎస్సారెస్పీకి పోటెత్తిన వరద నీరు

- 41వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



బాల్కొండ: స్థానిక ఎగువ ప్రాంతాల్లో గురువారం భారీ వర్షం కురియడంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద నీరు పోటెత్తింది. 41 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ఉదయం 5 వేల క్యూసెక్కులకు పడిపోయిన వరద నీరు క్రమంగా పెరిగింది. మధ్యాహ్నానికి 20 వేల క్యూసెక్కులు పెరిగిన వరద సాయంత్రానికి 41 వేల క్యూసెక్కులకు పెరిగింది. రానున్న 24 గంటల్లో మరింత వరద నీరు పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ప్రాజెక్ట్ నుంచి సరస్వతి కాలువ ద్వారా 10 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 423 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80 టీఎంసీలు) అడుగులు కాగా గురువారం సాయంత్రానికి ప్రాజెక్ట్ లో 1077.20 (37.24 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు పేర్కొన్నారు.

ఒలింపిక్స్‌కు రాష్ట్ర ప్రతినిధిగా మహేశ్‌కుమార్‌గౌడ్



ఖలీల్‌వాడి : రాష్ట్ర ప్రభుత్వం తరపున ఒలింపిక్స్‌కు ప్రతినిధులుగా ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారు జితేందర్‌రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, అధికారులు వెళ్లనున్నారు. ఈ నెల 3 నుంచి 13 వరకు వీరు పారిస్‌లో పర్యటించనున్నారు.

అక్రమాన్ని సక్రమం చేసుకునేందుకు..



- పాత తప్పును సమర్థించుకునేందుకు కుయుక్తులు
- తెయూలో 2014 వివాదాస్పద నియామకాలకు పచ్చజెండా ఊపేలా ప్లాన్
- అంతర్గత పాలకమండలి సభ్యుల నియామకాల నేపథ్యంలో పథక రచన

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ‘పదేళ్ల క్రితం చేసిన అక్రమాన్ని సక్రమం చేసుకునేందుకు ప్రస్తుత అవకాశాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకునేందుకు పథక రచన చేశారు. అందుకే 2014 వివాదాస్పద నియామకాల్లో ఉద్యోగాలు దక్కించుకున్న వారిని పాలకమండలిలో ఇంటర్నల్ సభ్యులుగా చేర్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు’. అంటూ తెలంగాణ వర్సిటీలో చర్చోపచర్చలు జరుగుతున్నాయి. ఇందుకు సంబంధించి ఉన్నతవిద్యా మండలి చైర్మన్, యూనివర్సిటీ రిజిస్ట్రార్ తాము రూపొందించుకున్న వ్యూహాన్ని అమలు చేసేందుకు పావులు కదుపుతున్నారని వర్సిటీలో కోడైకూస్తోంది. దీంతో తెయూలో మరో సరికొత్త వివాదానికి తెరలేచింది.

ఇదే అదునుగా భావించి అప్పుడు వర్సిటీ రిజిస్ట్రార్‌గా ఉన్న, ఇప్పటి ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య లింబాద్రి అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చారు. 2014 జనవరి 4న తెల్లవారుజామున నాలుగు గంటల నుంచే అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు జారీ చేసి అదే సమయంలో విధుల్లోకి చేర్చుకున్నారు. అప్పుడు ఇది పెద్ద ఎత్తున వివాదాస్పదమైంది. 2012 నుంచి వరుసగా ప్రతి పాలక మండలి సమావేశంలో ఈ అంశం తెరపైకి తెస్తున్నారు. దీంతో ఈ అంశం వచ్చిన ప్రతిసారి, అప్పటి నుంచి ఇప్పటివరకు తిరస్కరణకు గురవుతూ వస్తోంది. హైకోర్టు తుది తీర్పు వచ్చే వరకు ఎలాంటి పదోన్నతులు కల్పించరాదని తీర్మానం చేశారు. దీనికి తోడు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నియామకాలపై స్టే విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 2014 జనవరి 3న ఈ నియామకాలపై ఉన్న స్టేకు షరతులు విధిస్తూ కోర్టు సడలింపు ఇచ్చింది. దీన్ని అదునుగా తీసుకుని 4వ తేదీ తెల్లవారుజామున నాలుగు గంటలకు అపాయింట్‌మెంట్ ఆర్డర్లు జారీ చేసి అప్పటికప్పుడే హుటాహుటిన విధుల్లోకి చేర్చుకున్నట్లు ఆరోపణలున్నాయి. అప్పుడు ప్రిన్సిపల్‌గా ప్రస్తుత రిజిస్ట్రార్ ఆచార్య యాదగిరి ఉన్నారు. దీని వెనుక పెద్దమొత్తంలో ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు ఆరోపణలున్నాయి.

■ అదే ఏడాది జూన్‌లో టీఆర్‌ఎస్ ప్రభుత్వం రావడంతో ఈ వ్యవహారం పక్కకు వెళ్లింది. ఇప్పుడు అదే ఆచార్య లింబాద్రి, యాదగిరి కలిసి విద్యాశాఖ కార్యదర్శి వెంకటేశంను ఒప్పించి ఎలాగైనా 2014 వివాదాస్పదమైన నియామకాల కింద వచ్చిన అభ్యర్థులు పాలకమండలిలో ఉండేలా చర్యలు తీసుకుంటున్నారని సమాచారం. దీని వెనుక పెద్ద ఎత్తున ఆర్థిక లావాదేవీలు జరుగుతున్నట్లు యూనివర్సిటీలో విద్యార్థులు, అధ్యాపకులు చర్చించుకుంటున్నారు. వివాదాస్పదమైన 2014 లో నియామకమైన బోధన సిబ్బందికి పాలకమండలిలో చోటు కల్పిస్తే మరో వివాదానికి తెలంగాణ వర్సిటీ కేంద్ర బిందువు అవుతుందనే చర్చ నడుస్తోంది.

■ 2014లో వర్సిటీ రిజిస్ట్రార్ గా ఉన్న లింబాద్రి ఇప్పుడు ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా ఉన్నారు. అప్పుడు యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపల్‌గా ఉన్న ఆచార్య యాదగిరి ఇప్పుడు వర్సిటీ రిజిస్ట్రార్‌గా ఉన్నారు. వీళ్లిద్దరూ కలిసి ఉన్నత విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశంతో కుమ్మక్కై పెద్దఎత్తున అక్రమాలకు తెరతీసినట్లు వర్సిటీ వర్గాలు తీవ్రమైన ఆరోపణ చేస్తున్నాయి. రాష్ట్రంలో అన్ని వర్సిటీలు స్థానిక ఎమ్మెల్యేలకు ఈసీ సభ్యుల జాబితా రూపొందించడంలో ప్రాధాన్యత ఇస్తే ఇక్కడ మాత్రం అందుకు భిన్నంగా వ్యవహారం నడుస్తుండడం గమనార్హం.

ఏమిటీ 2014 వివాదం..

తెలంగాణ యూనివర్సిటీకి ఆచార్య అక్బర్ అలీఖాన్ వైస్ చాన్స్‌లర్‌గా ఉన్న 2012లో చేపట్టిన (అధ్యాపక పోస్టుల) ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాల్లో అక్రమాలు, అవకతవకలు చోటుచేసుకున్నాయని సాక్ష్యాధారాలతో పత్రికల్లో కథనాలు వచ్చాయి. దాంతో సదరు నియామకాలను అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పక్కన పెట్టింది. ఈ నియామకాల్లో అక్రమాలు జరిగాయని కొందరు అభ్యర్థులు కోర్టును ఆశ్రయించారు. ఈ వివాదాస్పదమైన నియామకాలపై అప్పటి విద్యాశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ విచారణ కోసం భాస్కర్‌రావు, ప్రసాద్‌రావులతో కూడిన ద్విసభ్య కమిటీని ఏర్పాటు చేశారు. తర్వాత కొద్ది రోజులకు జస్టిస్ సీవీ రాములు నేతృత్వంలో ఏకసభ్య కమిటీ ఏర్పాటైంది.

డీఎంహెచ్‌వోగా రాజశ్రీ బాధ్యతల స్వీకరణ



నిజామాబాద్ నాగారం : జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి(డీఎంహెచ్‌వో)గా డాక్టర్ రాజశ్రీ గురువారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్‌లోని వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో ఆమె బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లా వైద్యారోగ్యశాఖను అన్ని విధాలుగా ప్రథమస్థానంలో నిలపడానికి కృషి చేస్తానని తెలిపారు. ఉద్యోగులు, అధికారులు సమష్టిగా పని చేస్తామన్నారు. సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. అనంతరం ఆమె కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతును మర్యాదపూర్వకంగా కలిశారు. అంతకుముందు డిప్యూటీ డీఎంహెచ్‌వో తుకారాంరాథోడ్, ఏవో చందర్, ఉద్యోగులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

ఇన్నాళ్లు ఇన్‌చార్జి పాలనే..

జిల్లాలో సుమారు ఎనిమిది ఏళ్లుగా జిల్లా వైద్యారోగ్యశాఖకు పూర్తిస్థాయి అధికారి లేరు. ఇన్‌చార్జి పాలనతో శాఖ అస్తవ్యస్థంగా మారిందనే విమర్శలు ఉన్నాయి.

టీబీ నియంత్రణ అధికారిగా దేవినాగేశ్వరి



జిల్లా టీబీ నియంత్రణ అధికారిగా దేవి నాగేశ్వరి గురువారం బాధ్యతలు స్వీకరించారు. జీజీహెచ్ నాలుగో అంతస్తులో ఉన్న టీబీ కార్యాలయంలో ఆమె బాధ్యతలు తీసుకున్నారు. హైదరాబాద్‌లో బ్యాక్టీరియాలాజిస్ట్, రాష్ట్ర టీబీ సెంటర్‌లో విధులు నిర్వహిస్తున్న ఆమె బదిలీపై జిల్లాకు వచ్చారు. 2004 నుంచి జిల్లాలో పూర్తిస్థాయి టీబీ అధికారి లేకపోవడంతో ఇన్‌చార్జీలతో నెట్టుకొచ్చారు.

‘స్వచ్ఛదనం–పచ్చదనం’ విజయవంతానికి చర్యలు

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు



వీసీలో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ అంకిత్

సుభాష్‌నగర్ : రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 5 నుంచి 9 వరకు చేపట్టనున్న ‘స్వచ్ఛదనం -పచ్చదనం’ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదేశించారు. కార్యక్రమ నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి గురువారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. వీసీ ముగిసిన అనంతరం కలెక్టర్ వివిధ శాఖల జిల్లా అధికారులతో సమావేశమై కార్యక్రమానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కార్యక్రమాల నిర్వహణ కోసం గ్రామాల వారీగా ప్రత్యేక కమిటీలను నియమిస్తామని, మండల ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పకడ్బందీ పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ఈనెల 5న ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని అట్టహాసంగా చేపట్టాలని, పచ్చదనం, పరిశుభ్రత, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం ఆవశ్యకత గురించి ప్రజల్లో అవగాహన పెంపొందించేలా అన్ని గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. దోమల నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, ట్రెయినీ కలెక్టర్ సంకేత్, డీఆర్డీవో సాయాగౌడ్, డీపీవో తరుణ్ కుమార్, డీఈవో దుర్గాప్రసాద్, డీఐఈవో రవికుమార్ పాల్గొన్నారు.

పలువురు అధికారుల బదిలీ

సుభాష్‌నగర్ : సాధారణ బదిలీల్లో భాగంగా నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీగా అపర్ణ బదిలీపై రానున్నారు. ప్రస్తుతం ఇక్కడ విధులు నిర్వహిస్తున్న వెంకటేశం మిర్యాలగూడకు బదిలీ అయ్యారు. అపర్ణ గుడి మల్కాపూర్ నుంచి నిజామాబాద్‌కు బదిలీపై వస్తున్నారు. బోధన్ వ్యవసాయ మార్కెట్ సెక్రెటరీగా వీ రామనాథరావు దేవరకొండ నుంచి బదిలీపై వస్తున్నారు. ఇక్కడ సెక్రెటరీగా ఉన్న పూర్యా పదోన్నతిపై భైంసాకు వెళ్లారు.

సబ్ రిజిస్ట్రార్లు..

జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్లను బదిలీ చేస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. నిజామాబాద్ అర్బన్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో జాయింట్-1 సబ్ రిజిస్ట్రార్ రామచంద్రయ్య వైరాకు, జాయింట్-2 సబ్ రిజిస్ట్రార్ బాదర్ నిజామాబాద్‌లోనే ఎంవీ ఆడిట్ విభాగానికి బదిలీ అయ్యారు. వారి స్థానంలో కిరణ్ తేజావత్ నిర్మల్ నుంచి, సీహెచ్ శ్రీరామరాజు ఆదిలాబాద్ నుంచి వస్తున్నారు. బోధన్ సబ్‌రిజిస్ట్రార్ ఎం రవికిరణ్ నిర్మల్‌కు వెళ్లగా, ఆయన స్థానంలో బోథ్ నుంచి ఆర్ సాయినాథ్ రానున్నారు. ఆర్మూర్ సబ్ రిజిస్ట్రార్ మహ్మద్ అసిఫుద్దీన్ మెట్‌పల్లికి ట్రాన్స్‌ఫర్ అయ్యారు. ఆదిలాబాద్ ఎంవీ ఆడిట్ నుంచి ఎస్ రాజశేఖర్‌రెడ్డి నిజామాబాద్ రూరల్‌కు, భైంసా నుంచి డి మహేందర్‌రెడ్డి ఆర్మూర్‌కు, మల్యాల నుంచి మహ్మద్ ఇక్బాల్ అహ్మద్ భీమ్‌గల్‌కు రానున్నారు.

ఎస్‌ఎల్‌ఆర్ ఏడీగా అశోక్

జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ)గా అశోక్ కరీంనగర్ నుంచి బదిలీపై వస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ ఇన్‌చార్జి ఏడీగా విధులు నిర్వర్తిస్తున్న శ్రీనివాసులు హన్మకొండకు బదిలీ అయ్యారు. అలాగే ఆర్మూర్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్(డీఐ) కె శ్రీనివాస్ నిర్మల్‌కు, బోధన్ డీఐ వెంకటేశ్ జగిత్యాల్‌కు, నిజామాబాద్ డీఐ శ్రీనివాస్ పవార్ కోరుట్లకు బదిలీ అయ్యారు. వారి స్థానంలో బోధన్‌కు మహబూబాబాద్ నుంచి దత్తు, నిజామాబాద్‌కు మెదక్ నుంచి శశికుమార్ వస్తున్నారు. ఆర్మూర్‌లో ఇంకా ఎవరికీ పోస్టింగ్ ఇవ్వలేదని తెలిసింది. వీరితోపాటు జిల్లాలోని వివిధ తహసీల్దార్ కార్యాలయాల్లో గల 9 మంది సర్వేయర్లు, నలుగురు డిప్యూటీ సర్వేయర్లు, సీనియర్ డ్రాఫ్ట్‌మెన్, సూపరింటెండెంట్ మల్టీజోన్-1 పరిధిలో బదిలీ అయ్యారు.

ట్రాఫిక్ ఉల్లంఘనులపై కొరడా

- నగరంలో 18 చోట్ల పోలీసుల తనిఖీలు
- 10 రోజుల్లో 440 బైక్‌ల పట్టివేత



నగరంలోని ఒకటో టౌన్ ఠాణాలో ఉన్న బైక్‌లు

ఖలీల్‌వాడి : ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించే వారిపై పోలీసులు కొరడా ఝుళిపిస్తున్నారు. వాహనదారులు నిబంధనలు పాటించకపోవడంతోనే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని పోలీసులు గుర్తించారు. ప్రమాదాలను నివారించడానికి ఓ వైపు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తునే, మరోవైపు విస్తృతంగా వాహనాల తనిఖీలు చేపడుతున్నారు. సీపీ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు జిల్లాలో ఆర్టీవో, పోలీసులు, ట్రాఫిక్ పోలీసులతో కంబైన్డ్ తనిఖీలను నిర్వహిస్తున్నారు. నిజామాబాద్ నగరంలో 18చోట్ల జూలై 22 నుంచి ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ట్రాఫిక్ రూల్స్‌ను అతిక్రమిస్తున్న వారి వాహనాలను స్వాధీనం చేసుకుంటున్నారు. ఈ తనిఖీల్లో జూలై31 వరకు 440 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిత్యం 40 నుంచి 50 వరకు రాంగ్‌రూట్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్ చేస్తున్న వాహనాలను పట్టుకుంటున్నారు. వాటిని స్వాధీనం చేసుకొని ఆర్టీవోకు పంపుతున్నారు. అక్కడి నుంచి క్లియరెన్స్ వస్తేనే వాహనాలు అప్పగిస్తున్నారు.

కంబైన్డ్ తనిఖీలు

జిల్లాలో పోలీసులు, ఆర్టీవో అధికారులు, ట్రాఫిక్ పోలీసులు జూన్ 6 నుంచి కంబైన్డ్ తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలలో జూలై 25 వరకు 903 వాహనాలను స్వాధీనం చేసుకొని జరిమానాలు విధించారు. సరైన పత్రాలు లేకపోవడంతో పలువురు తమ వాహనాలను పోలీసుల వద్దే వదిలేస్తున్నట్లు తెలిసింది. ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతున్నాయి. ఆర్టీఏ అధికారులు వారంలో రెండు రోజులు తనిఖీల్లో పాల్గొంటున్నారు. కాగా పోలీసులు వాహనాలను పట్టుకోగానే స్థానిక నాయకులు ఫోన్ చేసి వదిలేయమని ఒత్తిడి చేస్తున్నారు. తమకు సంబంధించిన వారిదని వాహనాలను విడిచిపెట్టాలని సూచిస్తున్నారు. కానీ ట్రాఫిక్ పోలీసులు మాత్రం పట్టుకున్న వాహనాలను ఆర్టీఏ అధికారులకు పంపిస్తున్నారు.

ప్రమాదాలు నివారించడానికే..

ట్రాఫిక్ రూల్స్ పాటించకపోవడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాలు తగ్గించడానికే తనిఖీలు నిర్వహిస్తున్నాం. మైనర్లకు వాహనాలు ఇస్తే వాహనం ఎవరి పేరుతో ఉందో వారిపై కేసు నమోదు చేస్తాం. సెల్‌ఫోన్, రాంగ్‌రూట్ డ్రైవింగ్‌తో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

– నారాయణ, ట్రాఫిక్ ఏసీపీ, నిజామాబాద్

నేడు దోస్త్ ప్రత్యేక కేటగిరీ ధ్రువపత్రాల పరిశీలన

తెయూ(డిచ్‌పల్లి) : తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో దోస్త్ ఆన్‌లైన్ డిగ్రీ ప్రవేశాలకు రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రత్యేక కేటగిరి విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన శుక్రవారం నిర్వహించనున్నట్లు దోస్త్ కోఆర్డినేటర్ సంపత్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక కేటగిరీ పీహెచ్‌సీ (దివ్యాంగులు)/సీఏపీ/ఎన్‌సీసీ/స్పోర్ట్స్/ఎక్స్‌ట్రా కరిక్యులర్ ఆక్టివిటీస్ విద్యార్థులకు తెయూ పరిపాలనా భవనంలో ధ్రువపత్రాల పరిశీలన ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని పేర్కొన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో పాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలతో కార్యాలయంలో హాజరు కావాలన్నారు. వివరాలకు 83744 06322 నంబర్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

పల్లెల్లో పడకేసిన పారిశుద్ధ్యం

- పంచాయతీల నిర్వహణకు నిధులు నిల్
- సీజనల్ వ్యాధులు, జ్వరాల బారిన ప్రజలు
- గ్రామాల వైపు కన్నెత్తి చూడని ప్రత్యేకాధికారులు



సిరికొండ మండలం కొండాపూర్‌లో అపరిశుభ్రంగా పరిసరాలు



నల్లవెల్లిలో పెరిగిన పిచ్చిమొక్కలు

సుభాష్‌నగర్: గ్రామపంచాయతీల్లో పారిశుద్ధ్యం పడకేసింది. ప్రజలు సీజనల్ వ్యాధులు, జ్వరాల బారిన పడుతున్నారు. దీంతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు ఓపీ, ఇన్ పేషెంట్లతో కిటకిటలాడుతున్నాయి. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు దాదాపు ఏడాదిగా నిధులు విడుదల కాకపోవడంతో ఖాతాలు నిండుకున్నాయి. చాలా పల్లెల్లో నిర్వహణ భారాన్ని పంచాయతీ కార్యదర్శులే మోస్తున్నారు. పంచాయతీ పాలకవర్గాల గడువు ముగిసిన తర్వాత ప్రభుత్వం ప్రత్యేకాధికారుల పాలనకు శ్రీకారం చుట్టగా, వారు గ్రామాల వైపు కన్నెత్తిచూడటం లేదు. జిల్లాలో 530 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. పంచాయతీల నిర్వహణకు పాలకవర్గాల గడువు ముగిశాక ఆర్థిక సంఘం నిధులు, సుమారు 15 నెలల నుంచి స్టేట్ ఫైనాన్స్ నిధులు విడుదల కావడంలేదు. పాలకవర్గాలు ఉన్న సమయంలో సర్పంచులు నిధులు రాకపోయినా సొంతంగా భరించారు. జిల్లాకు దాదాపు రూ.60కోట్లకుపైగా నిధులు విడుదల కావాల్సి ఉంది. పాలకవర్గాల గడువు ముగిసిన తర్వాత పారిశుద్ధ్యం పడకేసింది. నిధులు లేక పంచాయతీ కార్మికుల వేతనాలు సైతం చెల్లించలేని దుస్థితి నెలకొంది. గ్రామాల్లో పన్నులు వసూలు చేసి అరకొర వేతనాలు చెల్లిస్తున్న తరుణంలో ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు విడుదల చేసింది. మళ్లీ రెండు నెలలుగా వేతనాలు రావడంలేదు.

పంచాయతీ కార్యదర్శులపై భారం

గ్రామపంచాయతీ పాలకవర్గాల గడువు ఫిబ్రవరి 1తో ముగిసింది. ప్రభుత్వం మండలంలోని అన్ని శాఖల సీనియర్ అసిస్టెంట్ స్థాయి అధికారులకు గ్రామాలకు ప్రత్యేకాధికారులుగా నియమించింది. వారు ఆరు నెలలుగా అడపాదడపా గ్రామాలకు వస్తూ పోతున్నారే తప్పా.. పర్యవేక్షించడం లేదు. పంచాయతీ నిర్వహణ బాధ్యత అంతా కార్యదర్శులే చూసుకుంటున్నారు. ప్రస్తుతం పంచాయతీ ఖాతాలు నిండుకున్నాయి. ఒక్కో కార్యదర్శి సొంతంగా రూ.30వేల నుంచి రూ.50వేలకుపైనే ఖర్చు చేసుకున్నారు. కాగా పంచాయతీలకు పాలకవర్గాలు ఏర్పడిన తర్వాతే నిధులు విడుదలయ్యే అవకాశముంది. అంటే మరో 3 నెలలు ఆగాల్సిందేనని అధికారులు, పంచాయతీ కార్యదర్శులు చర్చించుకుంటున్నారు.

మంచం పట్టిన పల్లెలు

గ్రామాల్లో పల్లెలు మంచం పట్టాయి. పారిశుధ్యం పడకేయడంతో అపరిశుభ్రతకు నిలయాలుగా మా రాయి. మురుగుకాలువలు సక్రమంగా శుభ్రం చేయకపోవడం, చెత్తాచెదారంతో దోమలు, ఈగలు ఆవాసాలు ఏర్పర్చుకున్నాయి. చాలా గ్రామాల ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు. ప్రభుత్వ, ప్రయివేటు ఆస్పతులు జ్వర పీడితులతో కిటకిటలాడుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పంచాయతీలకు నిధులు కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.

పారిశుధ్యానికి ప్రాధాన్యత



గ్రామాల్లో పారిశుధ్యానికి ప్రాధాన్యతనిస్తున్నాం. నిధులు రాకపోవడంతో పంచాయతీ నిర్వహణ భారం అవుతున్న మాట వాస్తవమే. పంచాయతీ కార్మికులతో మురుగుకాల్వలు శుభ్రం చేయిస్తున్నాం. దోమల నిర్మూలన కోసం ఫాగింగ్, నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటున్నాం. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– తరుణ్‌కుమార్, జిల్లా పంచాయతీ అధికారి

అర్హత ఉన్నా.. అందని రుణమాఫీ

- ఆందోళనలో రైతులు
- చేతులెత్తేస్తున్న అధికారులు



పోర్టల్‌లో చూపుతున్న పొంతన లేని కారణాలు

ఇందల్వాయి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రుణమాఫీ పథకం అర్హులైన రైతులకు అందడం లేదు. సాంకేతిక కారణాలతో పాటు ఆధార్‌కార్డుల్లో పేర్లలో, ఇతర తప్పులు రావడంతో అర్హులకు రుణ మాఫీ అందడం లేదు. దీంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ అయిన రూ. రెండు లక్షల రుణమాఫీని ఒకే సారి అమలు చేయకుండా విడుతల వారీగా చేయడంపై రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీంతో తమ వివరాలు పక్కాగా ఉన్నాయో లేదోనని, తమకు రుణమాఫీ అందుతుందో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

నల్లవెల్లి గ్రామానికి చెందిన గుజ్జల శివం రెడ్డి అనే రైతు సిర్నాపల్లి ఇండియన్ బ్యాంకులో 2021లో రూ. రెండు లక్షల పంట రుణం తీసుకొని 2022లో చెల్లించాడు. గత ప్రభుత్వ హయాంలో ఇతడికి రుణ మాఫీ కాలేదు. ఈ సారి కేవలం రూ. 240 మాఫీ వచ్చినట్లు ఫోన్‌కి మెసేజ్ వచ్చింది. ఈ విషయమై బ్యాంక్ మేనేజర్‌ని సంప్రదిస్తే ఇలాగే మరో ముగ్గురికి వచ్చాయని, సమస్యను సంబంధిత అధికారులకు తెలియజేస్తామని తెలిపారు.





నల్లవెల్లి సొసైటీలో సందేహాలు నివృత్తి చేసుకుంటున్న రైతులు

ప్రభుత్వానికి నివేదిస్తాం

మాకు అందుబాటులో ఉన్న రుణమాఫీ పోర్టల్‌లో రైతులకు రుణాల స్టేటస్ మాత్రమే చూడగలుగుతున్నాం. సాంకేతిక సమస్యల వివరాలు, అర్హులై ఉండి మాఫీ వర్తించని రైతుల వివరాలు నమోదు చేసుకొని పైఅధికారులకు నివేదిక అందిస్తాం. తదుపరి ప్రభుత్వ ఆదేశాలు, సూచనలు వచ్చే వరకు వేచిచూసి అర్హులకు మాఫీ వర్తించేలా కృషి చేస్తాం. రైతులు ఎలాంటి ఆందోళన చెందొద్దు.

– ప్రదీప్ కుమార్, ఏడీఏ, నిజామాబాద్ రూరల్

సమస్యను పరిష్కరించాలి

అర్హులకు రుణమాఫీ అందించాలి. సాంకేతిక కారణాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వాటిని వేగంగా పరిష్కరించాలి. ఏకకాలంలో రుణ మాఫీ విడుదల చేయకుండా సాగదీస్తున్నారు. దీంతో సగం మంది రైతులకు ఇప్పటికీ రుణమాఫీ అందలేదు. అన్ని బ్యాంకుల్లో సహాయ కేంద్రాలు ఏర్పాటు చేసి మాఫీ కానీ రైతుల వివరాలు సేకరించాలి.

– పాట్కూరి తిరుపతి రెడ్డి, బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు

ఆశగా ఎదురు చూశాను



నాకు నల్లవెల్లి సొసైటీలో రూ. లక్షా ఇరవై వేల పంట రుణం ఉంది. మాఫీ వస్తుందని ఎంతో ఆశగా ఎదురు చూశాను. పేరు తప్పుగా ఉందని రుణ మాఫీ జాబితాలో నా పేరు లేదు. ప్రభుత్వం మాలాంటి రైతులకు న్యాయం చేసి ఆదుకోవాలి.

– భూక్య దరిసింగ్, కేకే తండా

కల్లు దుకాణానికి షోకాజ్ నోటీసులు

సాక్షి ఎఫెక్ట్..

ఖలీల్‌వాడి: నగరంలోని దుబ్బ రోడ్డులో ఉన్న కల్లు దుకాణానికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి గురువారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. స్థానిక కాలనీవాసులు కల్లు దుకాణంలో మద్యం అమ్మకాలు చేపడుతున్నట్లు గతనెల ప్రజావాణిలో ఫిర్యాదు చేశారన్నారు. జూలై16న ఎస్‌హెచ్‌వో దిలీప్‌తోపాటు ఎస్సై సుష్మ రూ.39 వేల మద్యాన్ని పట్టుకున్నారు. మద్యాన్ని తీసుకెళ్తున్న ఎస్‌హెచ్‌వో దిలీప్‌కు ఫోన్ రావడంతో అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. ఈ విషయమై 'సాక్షి' దినపత్రికలో 'కల్లుబట్టీలో మద్యం పట్టివేత' అనే శీర్షికతో జూలై21న ప్రచురించగా స్పందించిన ఎస్‌హెచ్‌వో దిలీప్, ఎస్సై సుష్మలు 22న కల్లుబట్టీలో మళ్లీ తనిఖీలు చేపట్టి మద్యం లభించడంతో కేసు నమోదు చేశారు. ఈ విషయమై ఎక్సైజ్ రాష్ట్ర డైరెక్టర్ వివరణ కోరినట్లు తెలిసింది. డైరెక్టర్‌కు వివరణ ఇచ్చేందుకే కేసు నమోదు చేసి తప్పించుకునే ప్రయత్నం చేశారనే ఆరోపణలు ఉన్నాయి. కల్లుబట్టీలో మొదటి సారి మద్యం లభించడంతో హెచ్చరించి వదిలేశామని తర్వాత దొరికితే కేసు నమోదు చేస్తామని డైరెక్టర్‌కు వారు వివరణ ఇచ్చినట్లు తెలిసింది. మద్యం లభించిన కల్లుబట్టీపై చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డిని ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి లెటర్ పెట్టినట్లు తెలిసింది. దీంతో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి నుంచి ఆదేశాలు రావడంతో ఎక్సైజ్ అధికారులు షోకాజ్ నోటీసులు అందించారు.

విద్యార్థులకు వర్క్ షాప్

నిజామబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని ఆర్య సమాజ్ రాధాకృష్ణ పాఠశాలలో జిల్లాలో ఎనిమిది, తొమ్మిదో తరగతి చదువుతున్న పలు పాఠశాలల విద్యార్థులకు ఎల్‌ఈడీ ట్యూబ్‌లైట్ మేకింగ్‌పై గురువారం వర్క్‌షాప్ నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ, తెలంగాణ నేషనల్ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు అధికారి విద్యాసాగర్, కిరణ్ కుమార్, గోవర్ధన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎస్సైల బదిలీలు

ఖలీల్‌వాడి: నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పలువురు ఎస్సైలను బదిలీ చేస్తూ ఐజీ చంద్ర శేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. నందిపేట్ ఎస్సైగా పనిచేస్తున్న జి. రాహుల్ నిర్మల్ జిల్లా దస్తూరాబాద్‌కు, ఐదో టౌన్ ఎస్సైగా పని చేసి సీపీ ఆఫీస్‌కు అటాచ్ అయిన జి అశోక్ నిర్మల్ జిల్లా లోకేశ్వరం, మెండోరా ఎస్సైగా పనిచేస్తున్న జి శ్రీనివాస్ నిర్మల్ జిల్లా భైంసాకు బదిలీ కాగా జగిత్యాలలో ఎస్సైగా పనిచేస్తున్న మహమ్మద్ ఆరీఫ్ నిజామాబాద్ కమిషనరేట్‌కు బదిలీ అయ్యారు.

జిల్లా ఆయుష్ శాఖలో..

నిజామాబాద్‌నాగారం: జిల్లా ఆయుష్‌శాఖలో బదిలీలు జరిగాయి. ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాఖ సీనియర్ మెడికల్ ఆఫీసర్ డీఎస్ రమణామోహన్ హైదరాబాద్‌లోని ప్రభుత్వ ఆయుర్వేద ఎర్రగడ్డ ఆస్పత్రికి బదిలీ కాగా అక్కడి నుంచి డాక్టర్ ఎ నారాయణరావు జిల్లాకు బదిలీపై గురువారం బాధ్యతలు చేపట్టారు. నవీపేట్ మెడికల్ ఆఫీసర్ జి ప్రేమలత గుత్పకు అక్కడ నుంచి మమత బదిలీపై నవీపేట్‌కు, ఫార్మసిస్టు ఎస్ పురుషోత్తం పాతంగల్ నుంచి నిజామాబాద్ ప్రభుత్వ ఆయుర్వేదశాఖ కార్యాలయానికి బదిలీపై వచ్చారు. ఫార్మసిస్టు వరలక్ష్మి పడకల్ నుంచి ఎడపల్లికి, స్వీపర్ రమేశ్ ఎడపల్లి నుంచి ప్రభుత్వ ఆయుర్వేద శాఖ కార్యాలయానికి బదిలీ అయ్యారు. జిల్లాకు వచ్చిన అధికారి డాక్టర్ ఎ నారాయణరావును అధికారులు, సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో డీపీఎం వందన, డాక్టర్ వెంకట్, మాధురి, లలిత పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన దేవాదాయ సహాయ కమిషనర్



నిజామాబాద్‌అర్బన్: ఉమ్మడి నిజామాబాద్ జిల్లా దేవాదాయ, ధర్మాదాయ శాఖ నూతన సహాయ కమిషనర్‌గా విజయరామారావు గురువారం బాధ్యతలు చేపట్టారు. బాసర జ్ఞానసరస్వతి ఆలయ గ్రేడ్-1 ఈవోగా పని చేసిన ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. గత అధికారి సుప్రియ బాధ్యతలు అప్పగించారు. కార్యక్రమంలో పలువురు ఆలయ పూజారులు పాల్గొన్నారు.

పొంగుతున్న అలుగులు



బాన్సువాడ రూరల్ : గత వారంరోజులుగా అడపాదడపా కురుస్తున్న వర్షాలకు మండలంలోని చెరువులు జలకళను సంతరించుకున్నాయి. నెల రోజుల క్రితం నీళ్లలేక బోయిపోయిన కోనాపూర్ చెరువు ప్రస్తుతం నిండింది. దీంతో అలుగులు పొంగిపొర్లుతున్నాయి. మండలంలోని బోర్లం గ్రామ తోర చెరువు అలుగులు కూడా పొంగిపొర్లుతోంది.

క్రైం కార్నర్

కొబ్బరికాయలు తెంపబోయి మృత్యు ఒడిలోకి..

- ఎల్పుగొండలో విషాదం



ప్రవీణ్ (ఫైల్)

మాచారెడ్డి: ఇనుప సలాకాతో కొబ్బరికాయలు తెంపుతుండగా అది ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న 11 కేవీ విద్యుత్ తీగలపై పడడంతో విద్యుదాఘాతం సంభవించి ఓ యువకుడు మృతి చెందిన ఘటన పాల్వంచ మండలం ఎల్పుగొండలో గురువారం చోటు చేసుకుంది. మాచారెడ్డి ఎస్సై అనిల్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిని గెరిగంటి ప్రవీణ్(28) గ్రామ శివారులోని ఓ కోళ్ల ఫారం వద్ద కొబ్బరి కాయలను సలాకాతో తెంపుతుండగా ప్రమాదవశాత్తు ఆ సలాక విద్యుత్ తీగలపై పడింది. దీంతో విద్యుదాఘాతం సంభవించి ప్రవీణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. గతంలో భర్త, ఇప్పుడు కుటుంబానికి అండగా ఉండే కుమారుడి మృతి చెందడంతో తల్లి నర్సవ్వ చేసిన రోదనలు పలువురిని కంటతడి పెట్టించాయి. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై అనిల్ పేర్కొన్నారు.

బాత్‌రూమ్‌లో జారిపడి ఒకరి మృతి

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో బాత్‌రూమ్‌కు వెళ్లి జారిపడిన ఘటనలో ఒకరు మృతి చెందినట్లు నాలుగో టౌన్ ఎస్సై శ్రీకాంత్ గురువారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. డిచ్‌పల్లి మండల కేంద్రానికి చెందిన మహమ్మద్ అతురుల్లా(38) మెడికల్ ఫార్మసిస్టుగా పని చేస్తున్నారు. డెలివరీ కోసం తన భార్యను జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఉదయం బాత్‌రూంలో జారిపడి తలకు తీవ్రగాయం కావడంతో మృతి చెందారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ పేర్కొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

నిజామాబాద్‌రూరల్: మండలంలోని ఆకుల కొండూర్ గ్రామ వాగులో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు రూరల్ ఇన్‌చార్జి ఎస్సై రామారావు తెలిపారు. తీవ్ర వర్షాల నేపథ్యంలో వాగు ఉధృతి ప్రవాహానికి గుర్తు తెలియని మగవ్యక్తి మృతదేహం ఆకుల కొండూరు గ్రామ మత్తడి వద్ద కనిపించడంతో స్థానికులు రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతుడి వయస్సు 50 నుంచి 55 ఏళ్ల మధ్య వరకు ఉంటాడన్నారు. ఎవరైనా మృతుడి ఆచూకీ తెలిసిన వారు 8712659849 నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

రెండు బైక్‌లు ఢీ: ఇద్దరికి గాయాలు

బాన్సువాడ రూరల్: రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలైన ఘటన మండలంలోని కొయ్యగుట్ట సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సాయికృప కాలనీలో నివాసం ఉండే సబావత్ రాజు, అనూష అనే దంపతులు జూలై30న కొత్తబాది నుంచి బాన్సువాడకు బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వచ్చిన మొగులాన్ గ్రామానికి ప్రేమ్ వీరిని ఎదురుగా బైక్‌పై వచ్చి వేగంగా ఢీకొన్నాడు. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న దంపతులకు గాయాలయ్యాయి. సబావత్ రాజు తమ్ముడు జయరాం ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యువకుడి అదృశ్యం

ఎల్లారెడ్డి: మండలంలోని లక్ష్మాపూర్‌కు చెందిన పోశెట్టి అనే యువకుడు అదృశ్యమైనట్లు ఎస్సై మహేశ్ గురువారం పేర్కొన్నారు. పోశెట్టి మామ సిద్ధయ్య పొలం పనులు సరిగా చేయడం లేదని మందలించడంతో గత నెల 29న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు పలు చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. సిద్ధయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

నిజామాబాద్‌రూరల్: మండలంలోని ముత్తకుంటలో పేకాట స్థావరంపై దాడి చేసి పేకాట ఆడుతున్న నలుగురిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఇన్‌చార్జి ఎస్సై రామారావు గురువారం తెలిపారు. గ్రామంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో టాస్క్‌ఫోర్స్ సీఐ పురుషోత్తం తన టీమ్‌తో కలిసి పేకాట స్థావరంపై దాడి నిర్వహించారు. దాడిలో నలుగురిని అరెస్టు చేయగా వారి నుంచి రూ.55 వేల నగదు పట్టుబడినట్లు తెలిపారు.

సెక్స్ వర్క్ పేరుతో పోస్టర్లు ముద్రించిన వ్యక్తి అరెస్ట్

కామారెడ్డి క్రైం: సెక్స్ వర్క్ పేరుతో పోస్టర్లు ముద్రించి జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో అతికించిన ఓ వ్యక్తిని పట్టణపోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. వివరాలిలా ఉన్నాయి. సెక్స్‌వర్క్ పేరుతో పోస్టర్లు ముద్రించినట్లు సమాచారం రావడంతో పట్టణ పోలీసులు విచారణ చేపట్టారు. పోస్టర్‌పై ఉన్న నెంబర్‌ను సంప్రదించి విచారణ చేపట్టగా అతడిని ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌కు చెందిన భరత్‌గా గుర్తించారు. సదరు వ్యక్తి సెక్స్ రాకెట్ లాంటిది నడపడం లేదని, అతని కోసమే మహిళలు కావాలనే ఉద్దేశంతో పోస్టర్లు అతికించినట్లు విచారణలో తేలిందని ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. అసభ్యకరమైన కార్యకలాపాలకు పాల్పడినందుకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి



తెయూ(డిచ్‌పల్లి): మత్తుపదార్థాలకు విద్యార్థులు, యువత దూరంగా ఉండాలని డ్రగ్స్, గంజాయి, ఇతర మత్తు పదార్థాల నివారణలో విద్యార్థుల పాత్ర కీలకమని ఏడో బెటాలియన్ ఆర్‌ఐ టి నాగేశ్వరరావు పేర్కొన్నారు. తెయూ న్యాయకళాశాల లో 'డ్రగ్స్ నివారణ – న్యాయ కళాశాల విద్యార్థుల పాత్ర' అనే అంశంపై గురువారం నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. టీనేజ్ పిల్లలు చెడు అలవాట్లకు బానిసలు అవుతున్నారని, డ్రగ్స్ విచ్చలవిడిగా వినియోగిస్తున్నారని తెలిపారు. డ్రగ్స్ నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టిందన్నారు. నిజామాబాద్ బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పాఠశాల స్థాయి నుంచే డ్రగ్స్ నివారణ, వాటి దుష్పలితాలపై అవగాహన కల్పించాలన్నారు. సదస్సుకు టీవోఎస్ చైర్మన్ డాక్టర్ జెట్లింగ్ ఎల్లోసా అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పి నాగజ్యోతి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

6 నుంచి ఎంఈడీ సెమిస్టర్ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెయూ పరిధిలోని ఎంఈడీ నాలుగవ సెమిస్టర్ రెగ్యులర్, 2, 3వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలు ఈ నెల 6 నుంచి 19వరకు నిర్వహించనున్నట్లు కంట్రోలర్ ప్రొఫెసర్ ఎం అరుణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు తెయూ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

మేనేజ్‌మెంట్ నైపుణ్యాలు పెంపొందించుకోవాలి



తెయూ(డిచ్‌పల్లి): ఎంబీఏ విద్యార్థులు తమ మేనేజ్‌మెంట్ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని తెయూ ప్రొఫెసర్ ఆంజనేయులు సూచించారు. తెయూ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో ఈవెంట్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా విద్యార్థులు వర్లి ఆర్ట్ పోటీలు గురువారం నిర్వహించారు. పోటీల్లో క్యాంపస్‌లోని వివిధ విభాగాలకు చెందిన 25 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ఆర్ట్ నైపుణ్యాలను ప్రదర్శించారు. ఈవెంట్ మేనేజర్లు రావిచెడ్ అనూష, కొంగల ప్రియాంక, హనుమయ్ వినీల, ఈవెంట్ మెంటార్‌గా ప్రొఫెసర్ ఆంజనేయులు వ్యవహరించారు. న్యాయనిర్ణేతలు ప్రొఫెసర్ అపర్ణ, ప్రొఫెసర్ ఖైసర్ మహమ్మద్ విజేతలను ఎంపిక చేశారు. పోటీల్లో రమాదేవి (ప్రథమ), లావణ్య (ద్వితీయ), శ్రావ్య (తృతీయ) బహుమతులు సాధించారు.

పీజీ పరీక్షల్లో 27 మంది గైర్హాజరు

తెయూ(డిచ్‌పల్లి): తెయూ పరిధిలో కొనసాగుతున్న పీజీ ఇంటిగ్రేటెడ్, పీజీ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షల్లో గురువారం 27 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. తెయూ మెయిన్ క్యాంపస్, భిక్కనూర్ సౌత్‌క్యాంపస్, గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ (నిజామాబాద్), ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కాలేజ్(కామారెడ్డి), ఎస్ఆర్ఎన్‌కే ప్రభుత్వ డిగ్రీ కాలేజ్(బాన్సువాడ)లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో 1, 3, 4, 7, 9వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఉదయం నిర్వహించిన పరీక్షలో 151 మందికి 124 మంది హాజరు కాగా 27 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. మధ్యాహ్నం తెయూ మెయిన్ క్యాంపస్‌లో నిర్వహించిన పరీక్షల్లో ముగ్గురు విద్యార్థులకు ముగ్గురు హాజరైనట్లు ఆయన పేర్కొన్నారు.

అనుమతులు లేకున్నా.. యథేచ్ఛగా..

- 'కాళేశ్వరం' టన్నెల్ కంకర తరలింపు
- పట్టించుకోని మైనింగ్ అధికారులు



టన్నెల్ వద్ద కంకరను తరలిస్తున్న డంపర్

మోపాల్: మండలంలోని మంచిప్ప గ్రామశివారులో కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా టన్నెల్ నుంచి తీసిన కంకరను క్రషర్ యజమాని అనుమతులు లేకున్నా, యథేచ్ఛగా తరలిస్తున్నారు. అధికారులు, స్థానిక నాయకులతో క్రషర్ యజమాని కుమ్మక్కై సొమ్ముచేసుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. గతంలోనూ సదరు క్రషర్ యజమాని కంకరను తరలించుకెళ్లారనే ఆరోపణలు ఉన్నాయి.

ప్రభుత్వ ఆదాయానికి గండి..

కాళేశ్వరం ప్రాజెక్ట్ 21వ ప్యాకేజీలో భాగంగా మంచిప్ప నుంచి బాడ్సి వెళ్లే దారిలో టన్నెల్‌ను ఏర్పాటు చేశారు. ప్రాజెక్ట్ పనులు పూర్తి కాకపోవడంతో భవిష్యత్ అవసరాల నిమిత్తం కంకర డంపును నిల్వ చేశారు. కానీ కంజర్ శివారులోగల క్రషర్ యజమాని ఎలాంటి అనుమతులు తీసుకోకుండా రాత్రి, పగలూ తేడా లేకుండా కంకరను డంపర్ల ద్వారా తరలిస్తున్నారు. ఈవిషయపై పలుమార్లు మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారని వాపోతున్నారు.

పోలీస్‌స్టేషన్‌కు టిప్పర్ తరలింపు..

టన్నెల్ వద్ద నుంచి కంకర తరలిస్తున్నారనే సమాచారం అందుకున్న నీటిపారుదలశాఖ అధికారులు గురువారం పోలీసులు, మైనింగ్ అధికారులకు సమాచారమిచ్చారు. వెంటనే వారు కంకర తరలిస్తున్న టిప్పర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. జేసీబీ ట్రాలీ లేకపోవడంతో అక్కడే వదిలేసినట్లు తెలిసింది. కాగా మంచిప్ప గ్రామస్తులు అక్కడికి చేరుకుని రాత్రివేళల్లో టిప్పర్లు అతివేగంగా వెళ్తున్నాయని, వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోయారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు



విద్యార్థులను ప్రశ్నలు అడుగుతున్న కలెక్టర్

వర్ని(మోస్రా): విద్యార్థులకు అర్థమయ్యేలా ఉపాధ్యాయులు బోధన చేపట్టాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సూచించారు. మండలంలోని గోవూరు గ్రామంలో వన మహోత్సవంలో భాగంగా నాటిన మొక్కలను, అడవీ జంతువుల కోసం నాటిన వివిధ రకాల పండ్ల మొక్కలను కలెక్టర్ గురువారం పరిశీలించారు. అనంతరం స్థానిక జెడ్పీ పాఠశాలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యాబోధన చేపట్టాలన్నారు. తరగతి గదుల్లో పుస్తకాలు పరిశీలించి తెలుగు, ఆంగ్ల భాషల్లో విద్యార్థులకు పలు ప్రశ్నలు అడిగారు. మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఆరోగ్య కేంద్రం బయట ఉన్న పిచ్చి మొక్కలను ఎందుకు తొలగించలేదని సిబ్బందిని ప్రశ్నించారు. ఆస్పత్రిలోని హాజరు రిజిస్టర్, రక్త పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. కలెక్టర్ వెంట జిల్లా వైద్యాధికారి తుకారాం రాథోడ్, మండల ప్రత్యేకాధికారి రమేశ్, డీఎల్‌పీవో మధుకర్, ఎంఈవో నాగనాథ్, ఎంపీవో వెంకటేశ్వర్లు, గోవూర్ మాజీ సర్పంచ్ నరేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

విద్యుత్ రూరల్ డీఈ ఉన్నట్టా.. లేనట్లా!

- రెండేళ్ల క్రితమే ఇంజినీరింగ్, అకౌంట్ సెక్షన్ ఉద్యోగుల కేటాయింపు
- కిందిస్థాయి పోస్టులు కేటాయించకుండా కాలయాపన

నిజామాబాద్‌నాగారం: జిల్లాలో వ్యవసాయ, గృహాలు, పరిశ్రమలు ఇలా అన్ని కేటగిరిలకు సంబంధించి కనెక్షన్లు పెరుగుతున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకొని గత ప్రభుత్వ ఆదేశాల మేరకు 2022లో నాటి సీఎండీ రూరల్ డివిజన్‌ను కొత్తగా ఏర్పాటు చేశారు. ఇందులో ఇంజినీరింగ్, అకౌంట్ సెక్షన్లతో పాటు జూనియర్ లైన్‌మన్ నుంచి ఫోర్‌మన్ వరకు ఉద్యోగులను కేటాయించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో ఇంజినీరింగ్, అకౌంట్ సెక్షన్‌ల నుంచి ఉద్యోగులను నిజామాబాద్ రూరల్ డివిజన్‌కు అధికారులు కేటాయించారు. కానీ కింది స్థాయి ఉద్యోగులను మాత్రం కేటాయించలేదు.

జిల్లా వ్యాప్తంగా గతంలో బోధన్, ఆర్మూర్, నిజామాబాద్ మూడు డివిజన్లు మాత్రమే ఉండేవి. ఇందులో నుంచే నిజామాబాద్ రూరల్ డివిజన్‌ను ఏర్పాటు చేశారు. ఆర్మూర్ డివిజన్ నుంచి జక్రాన్‌పల్లి, సిరికొండ, పడకల్, గడ్కోల్‌ను, నిజామాబాద్ డివిజన్ నుంచి మోపాల్, డిచ్‌పల్లి, ధర్పల్లి, నిజామాబాద్‌రూరల్ సెక్షన్‌లను కలుపుకొని 2022లోనే రూరల్ డివిజన్‌ను ఏర్పాటు చేశారు. అప్పుడే డీఈ, ఇంజినీరింగ్ సెక్షన్‌కు సంబంధించి పలు పోస్టులను కేటాయించారు.

ఆపరేషన్‌కు సంబంధించిన జూనియర్, అసిస్టెంట్ లైన్‌మన్, లైన్‌మన్, లైన్‌ఇన్‌స్పెక్టర్, సీనియర్ లైన్‌ఇన్‌స్పెక్టర్, ఫోర్‌మన్‌లను కేటాయించాల్సి ఉంది. కానీ కింది స్థాయి ఉద్యోగులను కేటాయించకుండానే యథావిధిగానే ఆయా మండలాల్లో పని చేసే కిందిస్థాయి ఉద్యోగులతో రెండేళ్లుగా కాలం వెళ్లదీస్తున్నారు.

మెమో జారీలకు ఒకరు.. చర్యలకు మరొకరు

రూరల్ డివిజన్ ఏర్పాటు చేసి రెండేళ్లవుతున్నా రూరల్ డీఈకి పూర్తిస్థాయి అధికారాలు లేవు. కింది స్థాయి ఉద్యోగులు నిర్లక్ష్యంగా వ్యవహరించినా, తప్పులు చేసినా రూరల్ డీఈ మెమోలు, షోకాజ్‌లు ఇస్తారు. దీనిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారం మాత్రం నిజామాబాద్ డివిజన్ ఉద్యోగులకు సంబంధించి నిజామాబాద్ డీఈకి, ఆర్మూర్ డివిజన్ ఉద్యోగులకు సంబంధించి ఆర్మూర్ డీఈకి ఉంది. మరి ఇందులో రూరల్ డీఈ ఉన్నట్లా.. లేనట్లా అని ఉద్యోగులు తలలు పట్టుకుంటున్నారు.

ఉద్యోగులను కేటాయించాలి

కొత్తగా డివిజన్ ఏర్పాటు కాగానే ఇంజినీరింగ్, అకౌంట్ సెక్షన్ మాదిరిగానే జేఎల్‌ఎమ్ నుంచి ఫోర్‌మన్ వరకు ఉద్యోగులను కేటాయించాలి. అలా చేయకుండానే రెండేళ్లుగా కాలయాపన చేస్తున్నారు. దీనిపై జిల్లా అధికారికి విన్నవించాం.

– పూదరి గంగాధర్, 327 యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి

పదోన్నతులు జరగాల్సి ఉంది

డివిజన్ ఏర్పాటు కాగానే ఉద్యోగులను కేటాయించాలి. ఇంజినీరింగ్, అకౌంట్ సెక్షన్ ప్రక్రియ పూర్తయింది. జేఎల్ఎం నుంచి ఫోర్‌మన్ వరకు పదోన్నతులు జరగాల్సి ఉంది. ఆర్మూర్‌లో గతంలో పని చేసిన డివిజన్ అధికారి తప్పిదాలకు అసిస్టెంట్‌లైన్‌మన్ క్యాడర్‌లో సమస్యలు వస్తున్నాయి. దీంతో ఆలస్యమవుతోంది. – రవీందర్, విద్యుత్‌శాఖ ఎస్ఈ

పోచారం ఇంట్లో సీఎం రేవంత్ డిన్నర్



సీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పోచారం

వర్ని: హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో ఉన్న మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఇంట్లో బుధవారం రాత్రి నిర్వహించిన విందుకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. ఆసియా చెస్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో రెండు గోల్డ్ మెడల్స్ సాధించిన పోచారం మనవడు, జిల్లా సహకార బ్యాంక్ మాజీ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి తనయుడు రుషాంక్‌రెడ్డిని సీఎం అభినందించారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపా దాస్ మున్షీ, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు.

ఇరు వర్గాల మధ్య ఘర్షణ



గాయాలపాలైన శంకర్



ఘర్షణ పడుతున్న ఇరువర్గాలు

బాల్కొండ: మండల కేంద్రంలో ఇరువర్గాల మధ్య గురువారం ఘర్షణ చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలో గ్రామానికి జక్క శేఖర్ పాత జాతీయ రహదారి పక్కన ఉన్న ఇంట్లో కిరాణ షాపు నిర్వహిస్తున్నాడు. ఆ షాపు ఎదుట అదే గ్రామానికి చెందిన యూసుఫ్ కారును పార్కింగ్ చేశాడు. దీంతో షాపు యజమాని ఇక్కడ కారు పార్కింగ్ చేయవద్దని, వినియోగదారులకు ఇబ్బంది అవుతుందని యూసుఫ్‌కు తెలిపారు. దీంతో వారి మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దారి తీసింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ఇరువర్గాలతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. అనంతరం దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అరాఫత్ తెలిపారు.

సహజీవనం చేస్తున్న మహిళను హత్య చేసి..

- ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు యత్నం
- నిందితుడిపై కేసు నమోదు

కామారెడ్డి క్రైం: సహజీవనం చేస్తున్న మహిళను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు యత్నించిన ఒకరిపై హత్య కేసు నమోదైంది. నిర్మల్ జిల్లా బాసర మండలం ఓని గ్రామానికి చెందిన ఉమ(33)కు భర్త అశోక్, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. భర్తతో గొడవల కారణంగా వీరు వేరుగా ఉంటున్నారు. పిల్లలను తల్లిగారింటి వద్ద ఉంచిన ఉమ మూడేళ్లుగా కామారెడ్డిలో తెలిసిన వారి వద్ద పనిచేస్తూ జీవిస్తోంది. అబ్బువార్ మాధవ్ అనే వ్యక్తితో సహజీవనం చేస్తూ పట్టణంలోని పీఎంహెచ్ కాలనీలో నివాసం ఉంటోంది. గురువారం వీరి మధ్య గొడవ జరగడంతో మాధవ్ చున్నీతో ఉమ మెడకు బిగించి హత్య చేశాడు. ఆపై ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించి ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు యత్నించాడని పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. మృతురాలి తల్లి గౌతిక బాయి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి మాధవ్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.